భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

29, అక్టోబర్ 2026, గురువారం భారత్ సమాచార్

నర్సాపూర్‌లో వాటర్ ప్లాంట్లకు కమిషనర్ సడన్ చెకింగ్



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నీటి వనరులను కాపాడుకోవడం, భవిష్యత్తులో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై నర్సాపూర్ మున్సిపాలిటీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ మంచినీటి ప్లాంట్లను మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్లలో ఫిల్టర్ల ద్వారా బయటకు వస్తున్న వృథా నీటి వినియోగం, దానిని మళ్లిస్తున్న విధానాలను పరిశీలించి, నీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని యజమానులకు సూచించారు.

వృథా నీటిని భూమిలోకి మళ్లించాలి

మంచినీటి ప్లాంట్లలో ఫిల్టర్ల ద్వారా వెలువడే వృథా నీటిని మురికి కాలువల్లోకి వదలకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్లాంట్లలోని బోర్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, వృథా నీటిని వాటిలోకి మళ్లించాలని యజమానులను ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా నీటిని వృథా కాకుండా వినియోగించుకోవడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడవచ్చని సూచించారు.

ఈ సందర్భంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లాంట్ల యజమానులతో కమిషనర్ మాట్లాడారు. పనులను అలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి స్పందించిన యజమానులు రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతామని కమిషనర్‌కు తెలియజేశారు.



ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి పొదుపు ముఖ్యం

ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెరుకు సాయికుమార్ సూచించారు. నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని, వృథాను అరికట్టేందుకు వ్యక్తిగతంగా కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వృథా నీటిని భూమిలోకి మళ్లించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. నీటి వనరులను సంరక్షించడం ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, వ్యాపార సంస్థలు, ప్లాంట్ల యజమానులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్ పట్టణంలో నీటి సంరక్షణ చర్యలు సక్రమంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీల్లో వార్డు అధికారులు మహేందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రాములు, ప్రవీణ్, నాగేంద్రబాబు, శానిటరీ ఇన్‌చార్జి సల్ల మురళీమోహన్‌తో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar